'కొంటె' కథల్ని కంచికి పంపించేముందు, మరోమాట.
హాస్యం అనేది కథల్లోనే కాదు. అడుగడుగునా
కనిపిస్తుంది, చూసే ఓర్పూ నేర్పూ ఉంటే -
అవునా? చూడండి - ఎలా ఉంటుందో

# నిత్యజీవితంలో హాస్యం

వస్తుత: మనలో హాస్యదృష్టీ దానికి సంబంధించిన తత్త్వమూ ఉండాలే కాని, ఏ సంఘటనలో హాస్యం కనిపించదు కనకా? "అసలు, మనిషి బ్రతుకే ఒక హాస్యం. అతని చేష్టలూ మాటలూ అన్నీ నవ్వు పుట్టించేవే" అన్నాడు అమెరికన్ రచయిత మార్క్‌ట్వేన్. నిత్య జీవితంలో హాస్యానికో ఉదాహరణిస్తూ ఆయన అన్నాడు -

"మేం ఇద్దరం కవల పిల్లలం. ఒక్కలాగే ఉండే వాళ్ళం - నాముప్పయ్యో యేటొకాయన రోడ్డుమీద నన్ను ఆపి 'అవునూ? మీరిద్దరు కవలలు కదా. ఆ మధ్యన చెర్లోపడి చచ్చిపోయింది మీలో ఎవరూ?' అనడిగాడు; నేను వెంటనే 'అవునండీ! నిజమే. ఆ చచ్చిపోయింది వాడనుకుంటున్నారందరూ' అన్నా.. అంతే! దెయ్యాన్ని చూసినట్టు జారుకున్నాడు."

ఇలాటి అడగడాలు మార్క్‌ట్వేన్‌కే కాదు మనకీ అప్పుడప్పుడు ఎదురవుతూ ఉంటాయి "నిద్రనుంచి, అయితే లేచారన్నమాట!". "ఆఫీసుకేమిటి బయలుదేరుతున్నారు" - "అరే! మావిడి పళ్ళుకొన్నారా?" - ఏం ప్రశ్నలివి చెప్పండి! ఓ చేతిలో అమ్ముల పొదిలా కూరల సంచీ, మరో చేతిలో కోదండంలా పొడుగు పొట్లకాయా ధరించి వస్తూంటామా, కుశల ప్రశ్నల కుటుంబయ్యగారు అడగనే అడుగుతాడు ఎదరయి, 'ఏమిటి కూరల మార్కెట్‌నుంచా?' అంటూ - 'కాదు కురుక్షేత్రం నుంచి', అనాలనిపిస్తుంది. లేకపోతే ఏవిటా వెట్టి ప్రశ్న!

కూరలు అంటే జ్ఞాపకం వచ్చింది. కూరలమ్మే వాళ్లేకదా, వాళ్ళకేం మాట్లాడ్డం చేతనవునూ, నేనే పెద్దమాటకారినీ, అనుకొని మా ప్లీడరు బావ ఓమాటు 'కిలో రెండు

రూపాయలేవిటయ్యా! మతిలేకపోతేనూ?'' అన్నాడు. "అయ్యబాబు అంత మాత్రానికే మతిలేకపోతే ఎలాగండి!" అన్నాడు వెంటనే కూరల ఆసామీ! అది నలుగురికీ నాలుగు రకాలుగా అర్థం అయి నవ్వుకుంటే, మా బావ మళ్ళీ ఆ సంగతి ఎత్తితే ఒట్టు.

పాఠం చెబుతూ మా మేష్టారు ఓసారి జేబులోంచి సుద్దముక్క అనుకొని, అల్లం ముక్క తీసి అల్లరి అయి ఊరుకున్నారు. మరోమారు పరధ్యానంగా జేబులోంచి తెల్లగులాబీ పువ్వు తీసి,తబ్బిబ్బు పడితే తాటాకులు కట్టేస్తారు విద్యార్థులు అనుకుని క్లాసుకి కావాలనే తాను తెల్లగులాబి తెచ్చినట్టు ఫోజుపెట్టి, "Did you ever see a white rose?" అన్నారు. వెంటనే ఓ కొంటె కుర్రాడు చటుక్కున లేచి "why white sir! even black we see right here!" అన్నాడు. అంతా ఘొల్లుమన్నారు. కొంప మునిగింది. ముందు బెంచీలో కూర్చున్న రోజ్ అనే అమ్మాయి నల్లగా బిక్క మొహంతో తలదించుకుంది.

ఇన్సూరెన్స్‌వల్ల లాభాలు చెప్పవయ్యా మహానుభావా అంటూ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ వారు యీ మధ్య ఒకతనికి అధ్యక్ష పీఠం అందించారు. ఏం కసి ఉందో ఏమో ఆ మహానుభావుడు ప్లాట్‌ఫారం అంతా దున్నేసి, ఇన్సూరెన్స్‌వల్ల ఇండుప గింజంత కూడా ఉపయోగం లేదని తేల్చాడు. అయితే చివర్లో సమావేశకర్త వందన సమర్పణ చేస్తూ "ఇన్సూరెన్స్‌వల్ల బొత్తిగా ఉపయోగంలేదంటే ఎలా మరి? మనం ఇంట్లో వంకాయకూర వండమన్నాం అనుకోండి. ఆమె వండదు. ఫలానా పనిచెయ్యమన్నాం అనుకోండి. చెయ్యదు. అలాంటప్పుడు ఇన్సూరెన్స్ చక్కని ఆయుధంగా ఉపయోగిస్తుంది. అలాంటి సమయాల్లో పాలసీలో "నామినీ పేరు" మార్చేస్తామంటే సరి. ఠపీమని విస్తట్లోకి వంకాయకూర గట్రా వచ్చేస్తుంది. ఇల్లాల్ని మరోలా లొంగతీసుకోలేని పెద్దలకి ఇన్సూరెన్స్ బ్రహ్మాస్త్రంలాంటిది" అంటూ అధ్యక్షులవారి వైపుచూసాడు. సభ నవ్వులతో నిండిపోయింది. కథేమంటే అధ్యక్షులవారు ఇంట్లో పిల్లీ బయట పులీట. అది అందరికీ తెలుసుట. అందుకే వందన సమర్పణ అంత రక్తి కట్టింది!

మరీ, భార్య తనంటే వణకడంలేదని, ఒకాయన, చలికాలంలో పగలు ఊరంతా తిరిగి రాత్రి ప్రొద్దుపోయాక ఇంటికి వచ్చేవాడు. ఆవిడ వణుకుతూ వచ్చి తలుపుతీస్తే తనని చూసే వణికి పోతోందని సంతృప్తి పడేవాడు. భర్తకో, చలికో, ఎవరికో ఒకరికి వణికిందా లేదా, ఆమె - మునిమాణిక్యంగారి కాంతంలాంటి వాళ్ళయితే - హమ్మో - వాళ్ళు ఛస్తే వణకరు. పైగా ఫెడీ ఫెడీమని మాటకిమాట సమాధానం చెప్తారు.

ఆయన ఇరుకు మెట్లమీద ఎదురైన భార్యతో కోపంగా "నేను ఫూల్స్‌కి దారియ్యనం" టే, "నేనిస్తాను లెండి" అని ఆమె మృదువుగా ముఖమల్ పాదరక్షా ప్రహరణం కావించలేదండీ! అంత మరీ ముఖమల్ కాకపోయినా, ఫోమ్ పాదరక్షలైనా విసరగల్రు కొందరు.

మీరెక్కడా అననంటే ఓ సంగతి చెప్తా.

నేనో రోజున ఉత్సాహంగా ఏవో చెబుతున్నా, మా ఆవిడతో - నా మాటల్లో అంత ముఖ్యమైన సంగతులుండవని ఆమెకి ప్రగాఢమైన విశ్వాసం! అందువల్ల వంటింటి అలమారు సర్దుకుంటూ, మధ్య మధ్య ఆ... ఊ.. అంటూ వింటున్నట్లు నటిస్తోంది. మనదసలే మేష్టరీ కదా... వింటున్నారో లేదో ఇట్టే కనిపెడతాం- "ఏం చెబుతున్నాను" అని పరీక్ష కూడా పెడతాం, తిన్నగా ఉండక. అవునాండీ... ఆవిడ పరీక్షలో ఫెయిలయింది. దాంతో ఇంక చూడండి కోపం ముంచుకొచ్చి "ఎందుకొచ్చినవి? ఏనుగు చెవుల్లా అంతంత ఉన్నాయి ఏం లాభం" అన్నా. మనలో మనమాట. మాఆవిడ చెవులు పెద్దవిగా అందంగా శ్రీకారాల్లా ఉంటాయి లెండి, ప్రబంధాల్లో వర్ణించినట్లు. వెంటనే మెత్తగా ఆవిడ ఏం అందో తెలుసా? "అవును మరి! కొందరికి తన కళ్ళ అందం ఇస్తే, కొందరికి చెవులందం ఇచ్చింది ఏనుగు - ఏం చేస్తా?"... అంతే మన నోరు మూతపడింది. మన కళ్లు చిన్నవనే సంగతి గుర్తుండి వుంటే,ఆమె చెవుల గురించి అలా అనేవాడినటండీ.. భలేవారే!

మా ఆవిడకి చెవులున్నాయి. ఆ ఉన్న చెవులు వినిపిస్తాయి కూడా, వినకూడదని భీష్మించుకుంటే తప్ప. అయితే పాపం కొందరికి వినాలని ఎంతవున్నా వినిపించి చావవు. నా చెవులు వినిపించవు అని మాత్రం వాళ్ళు ఛస్తే ఒప్పుకోరు. మహ అన్నీ వినిపిస్తున్నట్టు తల ఊపుతూ మీరెక్కడుంటున్నారు' వంటి ప్రశ్నలు కూడా అవునవునంటూ చిరునవ్వులు చిందిస్తూ చిద్విలాసాలు ఒలకబోస్తారు. అలాంటివారు మా ఊళ్ళో ఇద్దరుండేవారు. వాళ్లెంతో అన్యోన్యంగా మాట్లాడుకొనేవాళ్ళు కూడా.

"ఏరా కావన్నా! కాకరపర్రువెళ్ళి వస్తున్నావా?" అని ఒకాయన ఆప్యాయంగా పలకరిస్తే, "లేదురా కాకరపర్రువెళ్లా" అనేవాడు రెండో ఆయన బుంగమూతిపెట్టి. దాంతో మొదటి ఆయన "ఆహా... అలాగా?... నువ్వింకా కాకరపర్రు వెళ్ళావేమో అనీ" ఇలా అనంతంగా సాగిపోయేది, అన్యోన్యంగా వాళ్ల సంభాషణ.

వినిపించనప్పుడు నోరుమూసుకుని ఊరుకోవచ్చు కదా! అలాగే - అవతలవ్యక్తి తెలియనప్పుడు పలకరించడం ఎందుకు చెప్పండి? అబ్బే అలా వూరుకోరే కొందరు!

మనలో చాలా మందికి ప్రతినిధి అయిన ఓ పెద్ద మనిషి రైల్లో ప్రయాణం చేస్తున్నాడు. ఎదుటి బెంచీమీద చెరుకువాడ వెంకటనరసింహంగారూ, నేనూ, ఇంకా నలుగురైదుగురం ఉన్నాం. పంతులుగారి ఖద్దరు పంచే లాల్చీ, స్టేషన్ స్టేషనుకీ రాజకీయ నాయకులు వచ్చి ఆయనని పలకరించి వెళుతూ ఉండడం,ఇదంతా చూసి చూసి,చివరికి "నమస్కారం అండీ" అన్నాడు ఆ పెద్దమనిషి ఊరుకోకుండా - ఎవరో నమస్కారం పెట్టారు స్వీకరిస్తే మన సొమ్మేం పోయిందని పోనీ ఈయన ఊరుకోవచ్చా? ఊహూ! "నేనెవర్ని అనుకున్నావు బాబూ నమస్కారం పెట్టావు?" అనడిగారు. అవతల ఆసామి తబ్బిబ్బుపడి చివరికి తట్టుకుని ధీమాగా "అయ్యబాబు! ఆమాత్రం తెలియదుటండీ! మీరు టంగుటూరి ప్రకాశంగారు" అన్నాడు. నరసింహం పంతులుగారు వేదాంత ధోరణిలో నవ్వి 'పొరబడ్డావు నాయనా' అని హితోపదేశం చేశారు. ఆ పెద్ద మనిషి అలాగా అని మరికాస్తసేపు ఆలోచించి "ఆ, జ్ఞాపకం వచ్చింది మీరు భోగరాజు పట్టాభి సీతారామయ్యగారు అయివుండాలి. అవునా?" అన్నాడు. నరసింహంగారి పెదిమలమీద మళ్ళీ వేదాంతి చిరునవ్వు. అవతల ఆసామీ వరసగా జ్ఞాపకం వచ్చిన రాజకీయ నాయకుల జాబితా అంతా ఏకరువు పెడుతున్నాడు. ఈయన ఒక్కదానికీ 'ఊ' - అనరే. ఇంతలో ఆ పెద్ద మనిషి దిగిపోవలసిన ఊరొచ్చింది. దిగిపోతూ దిగిబోతూ "ఈమారు సరిగ్గా జ్ఞాపకం వచ్చిందండీ. మీరు అవునన్నా కాదన్నా ఇది రైటే. మీరింక కాదనకండి. మీరు ఖచ్చితంగా దువ్వూరి వేంకట సుబ్బమ్మగారు" అంటూ వెళ్ళిపోయాడు. అంతా ఒకటే నవ్వు. నరసింహంగారు అంటారూ "ఓరి వీడి అసాధ్యం గూలా! తీసికెళ్ళి తీసికెళ్ళి నన్ను వీరేశలింగంగారి స్వజనంలో చేర్చేశాడు! మొదటే ఏ ప్రకాశంగారు అన్నప్పుడో ఒప్పేసుకోవాల్సింది. ఇప్పుడు చూడు. నెత్తిన ఈ కండువా కప్పుకోవాల్సి వచ్చింది". మళ్ళీ అందరం నవ్వాం.

ఫలానా అనుకొని మరో శాల్తీని పలకరించినప్పుడు ఆ మరో శాల్తీపడే అవస్థా, తికమకా, ఇబ్బందీ..కొత్తగా ఇల్లు కట్టుకొనే ఆలోచనవచ్చి, ఎవరెలా కట్టారా, అనే పరిశీలింపు ధోరణిలో పడి, నదరుగా కనిపించిన ప్రతి ఇంటిలోకీ తొంగిచూసి తగాదాలు కొని తెచ్చుకొనే గృహస్థుల పాట్లూ... ..యిలా నిత్య జీవితంలో కురిపించే హాస్యపు జల్లులు ఎన్నో.